'క్యాట్'లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

రాజంపేట అర్బన్: 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన మాథ్స్, ఫిజిక్స్, కెమెస్ట్రీ క్యాట్ ఒలంపియాడ్ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థులు సత్తాచాటి ప్రభంజనం సృష్టించారని ఎజిఎం రమణయ్య విజేతలకు ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ 4 నగదు పురస్కారాలు, 10 పతకాలు, 37 మంది విద్యార్థులు సర్టిఫికెట్లు సాధించారని తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపించడం వలన ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అనూష, అకడమిక్ డీన్ వెంకటసుబ్బయ్య, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

ఫ్లెక్సీ ప్రింటింగ్‌పై నీలినీడలు!

- 26వ తేదీతో ముగియనున్న నిషేధం గడువు
- క్లాత్ బ్యానర్స్ ప్రింటింగ్‌కు రూ.లక్షల్లో పెట్టుబడి
- ఆందోళనలో యాజమాన్యాలు, కార్మికులు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

ఫ్లెక్సీ ప్రింటింగ్ రంగంపై నీలినీడలు కమ్ముకున్నాయి. గతేడాది ఆగస్టు 26న విశాఖలో పర్యావరణానికి నష్టమనే పేరుతో ప్లాస్టిక్ ఫ్లెక్సీలపై నిషేధం విధిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించడం తెలిసిందే. అనంతరం చోటుచేసుకున్న ఆందోళనల కారణంగా ఈ నెల 26 నుంచి ఫ్లెక్సీలను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష కుటుంబాలు వీధిన పడుతున్నాయి. గత ఏడాది నవంబర్ ఒకటి నుంచి ఫ్లెక్సీ ప్రింటింగ్‌ను నిషేధిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై ఫ్లెక్సీప్రింటింగ్ యాజమాన్యాలు ఆందోళన చేయడంతో తాత్కాలికంగా వెనక్కితగ్గింది. ఈ ఏడాది జనవరి 26వ తేదీ నాటికి నిషేధం గడువును పొడిగించింది.

ఉమ్మడి జిల్లాలో 65 ఫ్లెక్సీ ప్రింటింగ్ మిషన్లు

ఉమ్మడి కడప జిల్లాలో 65పైగా ఫ్లెక్సీ ప్రింటింగ్ మిషన్లుఉన్నాయి. కడపలో 15, ప్రొద్దుటూరులో 10, రాజంపేటలో 9, రాయచోటిలో 6, బద్వేల్‌లో 8, రైల్వేకోడూరు, మైదుకూరు, పోరుమామిళ్ల, జమ్మలమడుగు పట్టణ ప్రాంతాల్లో నాలుగేసి చొప్పున కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ప్రింటింగ్ మిషనరీ కింద 12 నుంచి 25 మంది చొప్పున సుమారు 50 వేల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. ఫ్లెక్సీల వాహనాల ద్వారా వందలాది మంది ఉపాధి పొందుతున్నారు.

60 శాతానికి పడిపోయిన వ్యాపారం

ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 60 శాతం వ్యాపారం తగ్గిందని ఫ్లెక్సీప్రింటింగ్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన అనంతరం రీసైక్లింగ్ చేసుకోవడం ద్వారా పర్యావరణానికి ఎటువంటి నష్టమూ వాటిల్లదని పేర్కొంటున్నారు. ప్రభుత్వం సానుకూల

ప్రత్యామ్నాయాన్ని చూపించ కుండా నిబంధనల కొరఢా ఝుళిపించడంపై యాజమాన్యాలు వాపోతున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం కాలుష్య నియంత్రణ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, శానిటేషన్ సిబ్బంది, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సచివాలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా పరిషత్ సిఇఒ, కలెక్టర్‌కు అప్పగించారు. ఈ నెల 26 తేదీ నుంచి నిబంధనలు ఉల్లంఘిస్తే పర్యావరణ చట్టం ప్రకారం ఫ్లెక్సీప్రింటింగ్ చదరపు అడుగుకు రూ.100 చొప్పున జరిమానా విధించనున్నారు. వీటికి పోలీస్, రెవెన్యూ ట్రాన్స్‌పోర్ట్, జిఎస్‌టి అధికారులు సహాయ పడతారని ఉత్తర్వుల్లో పేర్కొనడం ఆందోళన కలిగిస్తోంది.

భారంగా క్లాత్‌బ్యానర్ ప్రింటింగ్

క్లాత్ బ్యానర్ ప్రింటింగ్ మిషన్లు ఖరీదు కావడం నిర్వాహకులను ఆందోళనకు గురిచేస్తోంది. సుమారు రూ.60 లక్షల మేర వ్యయం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం గడిచిన మూడు నెలల వ్యవధిలో ఏఒక్కరికీ ఆధునిక మిషనరీలను అందజేయలేదు. ఆధునిక మిషనరీల కొనుగోలు చేయడానికి సాహసం చేయాల్సి వస్తోంది. ప్రస్తుత మిషనరీలనే క్లాత్‌బ్యానర్ ప్రింటింగ్‌కు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రభుత్వం చెబుతున్న ఆధునిక మిషనరీల కొనుగోలు కారణంగా అప్పుల్లో కూరుకునిపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

నేటి నుంచి ప్రింటింగ్ నిలిపేస్తాం

ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా మంగళవారం నుంచి 26వ తేదీ వరకు ప్రభుత్వానికి సంబంధించిన ఎటువంటి ఫ్లెక్సీలను ప్రింటింగ్ చేయొద్దని నిర్ణయించాం. జిఒ నెంబర్ 65ను నిషేధించాలని కోరుతూ న్యాయస్థానాలను ఆశ్రయించాం. న్యాయస్థానాల నుంచి స్టే ఉత్వర్వులు వచ్చే అవకాశం ఉందనే ఆశాభావంతో ఉన్నాం. ప్రభుత్వం ఎటువంటి పర్యావరణ నష్టమూ వాటిల్లని నేపథ్యంలో నిషేధపు ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయం.

కె.చెన్నకృష్ణారెడ్డి, ఫ్లెక్సీ ప్రింటింగ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్, కడప.

పేదలకు నాణ్యమైన వైద్యం : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ గిరీష తెలిపారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని యూసుఫ్ షా ఖాద్రీ(బండ్లపెంట) దర్గా, కొత్తపేట రామాపురం, తిరుపతి నాయుడు కాలనీలో డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసే ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష మాట్లాడుతూ పట్టణ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారమన్నారు. వైద్య రంగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందన్నారు. కార్పొరేట్‌కు ధీటుగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలును నిర్మించడం జరుగుతోందన్నారు. పది నిమిషాలు నడవగానే వైద్యశాల వచ్చేలా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లను ఆదేశించారు. వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణాల్లో ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను పటిష్టపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వైద్య సదుపా యాలతో పాటు వైద్యాధికారులు, సిబ్బంది తగినంత స్థాయిలో ఉన్నా రన్నారు. రాయచోటి పట్టణంలో 4 డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ క్లినిక్‌లు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. పేదవానికి ఉచిత కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ మరింత పటిష్టం చేస్తామన్నారు. పట్టణంలో నిర్మాణ దశలో ఉన్న వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణాలు మార్చి కల్లా పూర్తవుతాయన్నారు. ఆరోగ్య రంగంలో రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. కళ్ళ ముందర అభివృద్ధి పనులు సాకారం అవుచుండడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కొత్తపల్లె వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్ర ప్రాంగణంలో కలెక్టర్, ఎమ్మెల్యే మొక్కలు నాటారు. మున్సిపాలిటీ పరిధిలోని తిరుపతి నాయుడు కాలనీలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కొత్తపేట రామాపురంలో రూ.1.65 లక్షల నిధులుతో నిర్మితమవుతున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులు, మౌలిక వసతుల నిర్మాణాలును పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషు, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, వార్డు కౌన్సిలర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

భూ కబ్జాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

వ్య.కా.స, కెవిపిఎస్ నాయకుల డిమాండ్

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజలు, నాయకులు

ప్రజాశక్తి-ఓబులవారిపల్లె

మండలంలో జరుగుతున్న భూ కబ్జాలపై సమగ్ర విచారణ చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎం.జయరామయ్య, పందికాళ్ళ మణి, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య అన్నారు. సోమవారం అధ్వర్యంలో తశీల్దారు కార్యాలయం మండల పరిధిలోని వైకోట, బాలిరెడ్డిపల్లె గ్రామాల నిరుపేద ప్రజలు, ఎస్‌సి, ఎస్‌టిలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద దళిత, గిరిజనులకు భూములు పంచాలని డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పేదలకు దక్కాల్సిన భూములను కొందరు కబ్జాదారులు అక్రమంగా ఆక్రమిం చుకుంటున్నారన్నారు. పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 8వ విడత భూపంపిణీలో పేదలకు భూములు పంచాలని డిమాండ్ చేశారు. అక్రమ భూములు కబ్జా చేసిన వారికి చేసిన ఆన్‌లైన్, నకిలీ పాస్‌పుస్తకాలను రద్దు చేయాలని కోరారు. వాటిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వందల ఎకరాల భూమలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ధర్నా అనంతరం తహశీల్దార్ మున్నీర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండలం కార్యదర్శి నాగిపోగు పెంచలయ్య, రైతు సంఘం నాయకులు చెంగయ్య, హరి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బొజ్జా శివయ్య, కేశవులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలి : గిరీష

ప్రజాశక్తి రాయచోటి

జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకం రీ-సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ గిరీష పిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి, రీ-సర్వే, స్పందన అర్జీలు, గడపగడపకు మన ప్రభుత్వం, సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్. ఆయుష్మాన్ భారత్, తదితర అంశాలపై మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ-సర్వే కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలన్నారు. ఆర్డీవోలు, తహశీల్దార్లు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. రీసర్వే పూర్తయిన చోట త్వరితగతిన భూహక్కుపత్రాలు పంపిణీ చేయాలన్నారు. రీ-సర్వే మ్యుటేషన్స్ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడూ క్లియర్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉద్యోగికీ ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి చేసిందని చెప్పారు. స్పందన అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎ లోకి వెళ్లకుండా గడువులోగా పరిష్కరించాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన ఆయుష్మాన్ భారత్ ఇకెవైసి పూర్తి చేయించాలని మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలను ఆదేశించారు. జిల్లాలోని సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పకుండా వంద శాతం వేసే విధంగా పర్యవేక్షణ ఉండాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులన్నీ గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వాలంటీర్ల ఖాళీలను భర్తీ చేయాలని ఎంపిడిఒలకు సూచించారు. క్యాస్ట్, ఇన్కమ్ సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలని తహశీల్దార్లను ఆదేశిం చారు. 74వ గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలలో శ్మశానవాటికలకు స్థలాలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సా రీయ, డిఆర్ఒ సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ జయరాజ్ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విశాఖపట్నం ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ అడ్డుకుంటామని పలువురు నాయకులు అన్నారు. సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం రిలే దీక్ష చేపట్టారు. దీక్షలకు జనసేన, టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సమస్థలను మోడీ అనుచర బృందానికి అప్పగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్.నరసింహులు, టిడిపి నాయకులు ఆర్‌జె.వెంకటేష్, జెఎసి నాయకులు జంగాల శివరాం, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబ శివ, నాయకులు మనోహర్‌రెడ్డి, సిద్ధిగాళ్ళ శ్రీనివాసులు, జనసేన నాయకులు శివరాం, టిడిపి నాయకులు ఆర్జె వెంకటేష్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రిలేదీక్షల్లో పాల్గొన్న నాయకులు

మధ్యాహ్న భోజనంలో తేలు

- భయంతో ఇంటికి వెళ్లి అన్నం తిన్న విద్యార్థులు

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీ పెద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో తేలు పడింది. విద్యార్థులు భయాందోళన చెంది ఇంటికి వెళ్లి అన్నం తిన్నారు. భోజనం కర్రీలో తేలు కన్పించడంతో ఉపాధ్యాయులు, వంట మనిషి అప్రమత్తమై విద్యార్థులకు అన్నం పెట్టలేదు. కోడిగుడ్ల కర్రీపై అట్టలు మూయడంతో దానికి అంటుకుని ఉన్న తేలు కూరలో పడింది. వెంటనే అక్కడున్న ఉపాధ్యాయులు అప్రమ్మత్తం కావడంతో ప్రమాదం తప్పింది. ఈ విషయం మండల విద్యాధికారి గిరి వరదయ్యకు తెలియడంతో ఆయన హుటా హుటీనా పాఠశాలకు వచ్చి విచారించారు. విద్యార్థులు ఎవరైనా తిన్నారా అని అడగగా తేలు కనపడిన వెంటనే ముందుగా కర్రీని పారవేశారని చెప్పారు. అప్పటికే ఆలస్యం కావడంతో తాము ఇళ్లకు వెళ్లి భోజనం తిన్నామని విద్యార్థులు చెప్పారు.

సర్వేతో భూ సమస్యలు దూరం

వీరబల్లి : భూముల రీ సర్వేతో రైతులకు భూముల సమస్యలు దూరం అవుతాయని తహశీల్దార్ తులసమ్మ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో భూముల రీ సర్వేపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ౧ బ్రిటిష్ కాలంలో భూముల సర్వే జరిగిందని ప్రస్తుతం చేపట్టడంతో భూ సమస్యలు లేకుండా పోతాయని చెప్పారు. రీ సర్వేకు అందరి సహకారం అవసరమని ప్రతి ఒక్కరూ ముందుగా తెలిపిన ప్రకారం భూముల వద్ద ఉండాలని తెలిపారు. అన్నదమ్ముల, ఇతర సమస్యలు వారి అంగీకారం మేరకు చేపడుతామని చెప్పారు. మంగళవారం నుంచి రీ సర్వే ప్రారంభం అవుతున్నట్లు చెప్పారు. మండల వైసిపి నాయకులు జి. వీరనాగిరెడ్డి మాట్లాడుతూ భూ సమస్యలు చాలావరకు తమ దృష్టికి వచ్చాయని అలాంటివన్నీ రీ సర్వేతో తొలగి కొత్త పాసుబుక్కులు అందజేస్తారని చెప్పారు. ప్రతి ఒక్క రైతూ అందుబాటులో ఉండి సర్వేయర్లకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి,ఆర్ఐ గోపి, సర్వేర్ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరంతర ఉద్యమాలు చేస్తాం : యుటియఫ్

కడప అర్బన్ : అధికారంలో ఏ ప్రభుత్వమున్నా విద్యరంగ, ఉపా ధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. సోమవారం యుటిఎఫ్ కార్యాలయంలో కడప ప్రాంతీయ మండలాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కూడా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపుతుందని భావిం చామని, అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్రాథమిక విద్యా విధానాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పనిచేయడంతో పాటు, ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డం బాధాకరమన్నారు. విద్యాశాఖ పట్ల అధికారుల తీరు అన్యాయంగా ఉందన్నారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షురాలు రూతు ఆరోగ్య మేరీ, జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, దావుద్దీన్ నాయ కులు సి.వి. రమణ, కరిముల్లా, గోపీనాథ్, శివకుమార్ రాజు, వెంకటరమణ, ప్రకాష్, శివ శంకర్, జావిద్, ఇబ్రహీం పాల్గొన్నారు.

'గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

74వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించి విజయవంతం చేయాలని సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోని అన్నమయ్య సభా భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు, రాజంపేట పట్టణ పౌరులు భారతదేశ గణతంత్ర దినోత్సవాన్ని అత్యంత వైభవంగా జరుపుకోవాలని కోరారు. జాతీయ జెండా ఎగరవేయుట, సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిఎస్‌పి శివభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్దన్‌రెడ్డి విద్యుత్ డిఇ చంద్రశేఖర్‌రెడ్డి, సబ్ రిజిస్ట్రార్, డిఎఫ్ఒ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 60 ఫిర్యాదులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. 60 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన ఫిర్యాదు దారులకు చట్టపరిధిలో నాయ్యం చేయాలని అధికారులకు సూచించారు. స్పందన దారులకు నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులకు సూచించారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నిటిపై విచారణ జరిపించి చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

తొలి సామాజిక విప్లవ కారుడు పూలే

- విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : తొలి సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలేనని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మాసాపేట జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన జ్యోతిరావుపూలే, యూసుఫ్‌షా ఖాద్రీ దర్గా సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణలో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక అసమానతల మీద అలుపెరుగని పోరాటం చేసిన జ్యోతిరావుపూలే జీవితం ప్రపంచానికే ఆదర్శమన్నారు. అణగారిన, అణచివేతకు గురైన బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆత్మ స్థైర్యం కల్పించి వారి సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడు పూలే అని తెలిపారు. పూలే అడుగు జాడల్లో సిఎం జగన్ నడుస్తున్నారన్నారు. మాజీ రాష్ట్రపతి కలాం ఆదర్శమూర్తి శాస్త్ర సాంకేతిక పరంగానూ, విద్యావేత్తగా, అధ్యాపకుడిగా, రాష్ట్రపతిగా దేశానికి విశిష్ట సేవలు అందించిన అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయ మన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన మహోన్నత వ్యక్తి, మిస్సైల్ మ్యాన్‌గా భారత సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప ప్రజ్ఞాశాలి అని అన్నారు. రాష్ట్రపతి వంటి అత్యున్నత పదవిలోనూ ఆయన నిరాడంబర జీవితాన్ని గడిపి అందరికీ ఆదర్శనీయులుగా నిలిచారన్నారు. కలలను సాకారం చేసుకోమంటూ విద్యార్థి లోకాన్ని తట్టిలేపారన్నారు. అబ్దుల్ కలాం బాటలో విద్యార్థులు, యువత నడవాలని శ్రీకాంత్ రెడ్డి సూచించారు. దేశవిదేశాల్లో భారతదేశ ఖ్యాతిని చాటిన మహనీయుడు కలాం అని కొనియాడారు

అర్జీదారులకు ఉచిత అన్నదానం

రాయచోటి టౌన్ : ప్రతి సోమవారమూ జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్, ఎస్‌పి కార్యాలయాలకు అర్జీదారులు, ప్రజలకు ఎంఎల్ఎ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైసిపి నాయకులు బేపారి మహ్మద్‌ఖాన్ సౌజన్యతతో అన్నదానం చేపట్టారు. ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి చేతుల మీదుగా అన్నం వడ్డించారు. వారం వారం ఎంఎల్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో దాతల సౌజన్యంతో గ్రీవెన్ సెల్ రోజున జిల్లావ్యాప్తంగా వచ్చే ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని ఉచితంగా అందిస్తుండడం హర్షణీయమని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు ఫయాజ్ బాష, ఫయాజుర్ రెహమాన్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచుల సంఘ జిల్లా అధ్యక్షుడు చిదంబర్ రెడ్డి, మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, అన్నా సలీం, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో స్పందన అర్జీదారులకు అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

'స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు'

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

స్పందన ఆర్జీలను నిర్లక్ష్యం చేయకుండా గడువు లోపల పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ గిరీష అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్ఒసత్యనారాయణ, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు స్పందన కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకుని ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను శనివారం లోపల క్లియర్ అయ్యేటట్లు చూడాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమానికి వస్తుంటారన్నారు. అధికారులు బాధితుల సమస్యలు గుర్తించి వెంటనే వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులకు అర్థమయ్యే విధంగా పరిష్కార నివేదిక పంపాలన్నారు. స్పందన కార్యక్రమంలో ఎక్కువగా భూ సమస్యలు, పంచాయతీరాజ్ శాఖ, సివిల్ సప్లైస్, డిపిఒ, తదితర శాఖలకు సంబంధించిన సమస్యలు వస్తుంటాయని అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రాయచోటి మండలం రాంనగర్‌కు చెందిన ఎస్.జాకీర్ హుస్సేన్ తనకు వికలాంగుల పింఛన్ మంజూరు చేయించాలని స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. రైల్వేకోడూరుకు చెందిన పి.హరిప్రసాద్ తనకు వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ డాక్టర్ వి.షణ్ముగనీతి

మిట్స్‌లో డేటా విజువల్స్‌పై సదస్సు

ప్రజాశక్తి-కురబలకోట

అంగళ్ళులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల, చెన్నై లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సంయుక్తముగా కళాశాలలో డేటా అనలిటిక్స్, విజువలైజేషన్ వారం రోజుల పాటు ప్రొఫెషనల్ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిసోర్స్‌పర్సన్‌గా డాక్టర్ వి.షణ్ముగనీతి పాల్గొన్నారు. కార్యక్రమంలో డేటాను ప్రాసెస్ చేయడానికి, విశ్లేషించడానికి, దృశ్యమానం చేయడానికి సాధారణంగా ఉపయోగించే గణాంక సాధనాల అవలోక నాన్ని అందిస్తుందని అన్నారు. డేటా, విజువల్ అనలిటిక్స్ అనేది విశ్లేషణ, మోడలింగ్‌కు సంబంధించిన అభివృద్ధి చెందుతున్న రంగమని, సంక్లిష్టమైన హై డైమెన్షనల్ డేటాను దృశ్యమానం చేస్తుందని అన్నారు. ఈ కోర్సు అత్యాధునిక మోడలింగ్, విశ్లేషణ, విజువలైజేషన్ టెక్నిక్‌లను కవర్ చేయడం ద్వారా అధ్యాపకులకు నూతన టెక్నాలజీపై అవగాహన కల్పిస్తుందనన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్.రామనాథన్ పాల్గొన్నారు.

జాతీయ బాలికా దినోత్సవం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

జాతీయ బాలిక దినోత్సవాన్ని పట్టణంలోని బాలికల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ జి.గౌరీదేవి మాట్లాడుతూ ఒకప్పుడు ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి పుట్టిందనేవారని, అంతలోనే ఆడపిల్ల అనే ధోరణి వచ్చిందన్నారు. 2008వ సంవత్సరం నుండి శిశుసంక్షేమశాఖ భారత జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. బాలికలకు విద్య, ఆరోగ్యం, హక్కులు, రక్షణ వంటి అంశాల అమలుకు దోహదపడుతుందన్నారు. జనవరి 23వ తేదీన బాలికలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆడపిల్లలు అనగానే భ్రూణహత్యలు నిర్మూలించడానికి, కేంద్ర ప్రభుత్వం భేటీ బచావో భేటీ పడావో బచావో ఆడపిల్ల పుట్టుకలో వివక్ష, విద్యలో వివక్ష కలుగుతుందన్నారు. ఆరు సంవత్సరాల లోపు గల వారిని 2011 జనాభా లెక్కల ప్రకారం 1000 మంది మగపిల్లలకు 914 మంది బాలికలు ఉన్నారంటే, వారిని ఎంత భారంగా భావిస్తున్నారో అర్థమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మకోసం, సోదరి కోసం, భార్యకోసం, భవిష్యత్తు కోసం, ప్రతి ఏడాది బాలిక దినోత్సవాన్ని ఓ పండుగలా జరుపుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో జిఎంఎకెడబ్ల్యూ శ్రీవాణి ఎం.సుజాత, ఎస్.నాగవేణి, సి.సునీత, ఎస్.మంగళ పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** మండలంలోని కలిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిషోర బాలికల అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో కలిచర్ల సెక్టార్ సూపర్వైజర్ నౌజియాబేగం మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టాలని, అందుకు విద్యార్థులదశ నుండి జ్ఞానోదయం పెంచుకోవాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానఉపాధ్యాయులు భారతి, ఫోర్డ్‌సంస్థ సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలో విద్యాశాఖ, ఐసిడిఎస్, బాలికల తల్లిదండ్రులు సమన్వయంతో కృషిచేసి బాల్య వివాహాలను అరికట్టాలని ఐసిడిఎస్ సూపర్వైజర్లు శ్వేతా, కుసుమాలు కోరారు. సోమవారం బాల్ రెడ్డి గారిపల్లి, గోపిదిన్నె ఉన్నత పాఠశాలలో భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. కిషోర్ బాలికలు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు పౌష్టికాహారం విలువలు, తదితరాంశాలపై వివరించారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు దివ్య, ఏఎన్ఎం సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ సిడిపిఒ పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో భేటీ పడావో భేటీ బచావో పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చిన్న వయసులో ఆడపిల్లలకు వివాహాలు చేస్తే తల్లిదండ్రుల శిక్ష పడుతుందన్నారు. కార్యక్ర మంలో ప్రిన్సిపల్ వంప్రసాద్, సూపర్వైజర్లు అరుణకుమారి, తులశమ్మ, దాది చెల్లమ్మ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఇఒగా వెంకటేష్ నాయక్

రాజంపేట అర్బన్ : మండల విద్యాశాఖ అధికారిగా టి.వెంకటేష్ నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఎంఇఒ గా ఉన్న రఘునాథరాజు బాధ్యతల నుండి తప్పుకున్నారు. వారిద్దరిని ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

మదనపల్లె అర్బన్: చిన్నపాటి మెళుకువలు పాటిస్తే అగ్ని ప్రమాదాలు నివారించ వచ్చునని, ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని ఎదుర్కోవడంపై విద్యార్థులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని మదనపల్లి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మాబు సుబాన్ స్పష్టం చేశారు. సోమవారం మదనపల్లె పట్టణం, నీరుగుట్టువారి పల్లెలో గల సాయివిద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో కరెస్పాండంట్ మోడెం శ్రీనివాస రావు ఆధ్వర్యంలో మదనపల్లి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ అధ్యకతన అగ్ని ప్రమాదాలు, నివారణ మార్గాలపై విద్యార్థులకు అవగా హన కల్పించారు. గ్యాస్, విద్యుత్, ఆయిల్ ఇతరత్రా ప్రమాదాలు, వాటి తీవ్రత, ప్రాణ, ఆస్తినష్టం జగకుండా తీసుకో వాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ ఆనంద్, డిఒపి బి.మురళి మోహన్‌నాయక్, ఎఫ్ఎంలు డిఎస్. విజయ్‌కుమార్, ఎస్ఎం. ఇమ్రాన్ తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటరమణ బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకట రమణ స్వామి ఆలయంలో టిటిడి ఆధ్వర్యంలో వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. సోమవారం అర్చకులు కృష్ణప్రసాద్ బట్టర్ రాఘ వేంద్ర స్వామి, రమేష్ బాబులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారి ముని, చంగల్ రాయుల, రవి, భక్తులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, MADANAPALLI
H.M.O.P. No. 151/2022

Kotakonda @ Tekulapalem Kukkala Anasuya. ...Petitioner

Vs

Tekulapalem, Lekkala Siva Sankar. ...Respondent

To,
Tekulapalem Kukkala Siva Sankar, S/o T.K.Krishnappa, 4/16, Surabhi Colony, Banglore Road, Madanapalli Town and Mandal, Crst While, Chittor District, New Annamaiah Dist.

NOTICE

పై దావాలో వాది ప్రతివాదిపైన విడాకుల కేసు వేసివున్నారు. పై దావాను తేది 30-1-2023వ తేదికి ఉదయం 10-00 గంటలకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మదనపల్లె వారి కోర్టుకు హాజరు కావలసినదిగా వేసివున్నారు. కావున మీరు/ టేకులపాలెం కుక్కం శివశంకర్‌గారు పై తేదీకి పై గంటలకు మీరు గాని, మీ తరపు వకీలుగానీ హాజరై మీ అభ్యంతరములు దాఖలు చేసుకొనవలెను. లేని పక్షమున మీ పరోక్షమున కేసు తీర్మానించబడును.

N.S.NILOFER
వాదిపరం లాయరు

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి : సిఐ

మదనపల్లి : సదస్సులో మాట్లాడుతున్న సిఐ మురళీకృష్ణ

ప్రజాశక్తి-కలికిరి

రోడ్డు ప్రమాదాలపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని వాల్మీకిపురం సిఐ బి.ఎస్ సురేష్ సూచించారు. సోమవారం స్థానిక ఎల్లమ్మగుడి సమీపంలో ఐటిబిపి 53వ బెటాలియన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐ సురేష్ మాట్లాడుతూ ముఖ్యంగా యువత కొత్త బైకుల మోజులో పడి అతివేగంతో వాహనాలు నడపటం వలన ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపుతున్నారని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు నెమ్మదిగా, భద్రంగా నడిపి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలను పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని అలా ఇస్తే వారితో పాటు వారి తల్లిదండ్రులు కూడా శిక్షార్హులు అవుతారని తెలిపారు. ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, వాహన రికార్డులు సక్రమంగా ఉండాలని, త్రిబుల్ రైడింగ్ చేయకూడదని, ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ లోకేష్ రెడ్డి, ఎఎస్ఐ మధుసూదనాచారి, ఐటిబిపి డిప్యూటీ కమాండెంట్లు శ్యామ్ కుమార్ శర్మ, రంజన్ కుమార్ అసిస్టెంట్ కమాండెంట్, ఐటిబిపి జవాన్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** మితిమీరిన వేగం నిర్లక్ష్యం వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలు జరిగి చాలామంది యువత తమ విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని వారి తల్లిదండ్రులకు తీరని శోకాన్ని కలిగిస్తున్నారని టూటౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో పట్టణంలోని శేష సాయికళ్యాణ మండపంలో జరిగిన యువశక్తి వాలంటీర్స్, ధాత్రి ఫౌండేషన్ సిఎం.రెడ్డి అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మదనపల్లి డిఎస్పీ కేశప్ప ఆధ్వర్యంలో పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో జాతీయ భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు, విద్యాసంస్థల ప్రతినిధులు కూడా తమకు సహకరించాలని సూచించారు. మదనపల్లి టూటౌన్ ఎస్ఐ జి.చంద్ర మోహన్ మాట్లాడుతూ వాహనాల రికార్డులు సక్రమంగా కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో ధాత్రి ఫౌండేషన్ నిర్వాహకురాలు డాక్టర్ స్వాతి, సిఎం.రెడ్డి అకాడమీ డైరెక్టర్ సిఎం రెడ్డి, సినీ యాక్టర్ అస్లాం, యువశక్తి వాలంటీర్స్ వ్యవస్థాపకులు గణేష్, పలువిద్యాసంస్థల ప్రతినిధులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా లోకేష్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-కలికిరి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు తెలుగు యువత ఆధ్వర్యంలో నగిరిపల్లి, కలికిరి పట్టణంలో అమర్నాథ్‌రెడ్డి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈనెల 27న యువగళం పాదయాత్ర విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీలేరు తెలుగు యువత అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, అవినాష్ రెడ్డి, కౌశిక్‌రెడ్డి, మౌలాలి, శ్రీనివాసులు రాకేష్, సీనియర్ నాయకులు ఎర్రంరెడ్డి, సహదేవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** నారా లోకేష్ 40వ పుట్టినరోజు వేడుకలను టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బత్యాలచంగల్‌రాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, తెలుగుయువత, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు. **వీరబల్లి :** మండల కేంద్రమైన వీరబల్లిలో టిడిపి జాతీయప్రధానకార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ టిడిపి నాయకులు చమ్మర్తి జగన్మోహన్ రాజు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి మండలఅధ్యక్షులు భానుగోపాలరాజు, నాయకులు వైరెడ్డప్పరెడ్డి, ఆంజనేయులు రెడ్డి, దుర్గం ఆంజనేయులు, భాస్కర్ రాజు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** టిడిపి ఎన్ఆర్ఐ నాయకులు లోకేష్ కొణిదెల ఆధ్వర్యంలో నారా లోకేష్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. 400 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపి విత్ సిబిఎన్ టీం సభ్యులు నిరంజన్ (నాని),నవీన్ పెరవలి, వంశీ, నరసింహ, మహేష్ రాటకొండ రాజేష్, ఆర్.జె.వెంకటేష్, నవీన్ చౌదరి, దొరస్వామి నాయుడు, పఠాన్ ఖాదర్ ఖాన్, ఎస్.ఎ.మస్తాన్, ప్రశాంత్ కొన్నారపు చంద్రశేఖర్, మాకినేని పెరవలి, మధు, ఆయుబ్ ఖాన్ పాల్గొన్నారు. **నందలూరు :** టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి గొబ్బిళ్ళ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నారా లోకేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నందలూరు సర్పంచ్ మోడపోతుల రాము, బిసి సెల్ కార్య నిర్వాహ కార్యదర్శి చుక్క యానాది, పాటూరు గ్రామ అధ్యక్షులు ముమ్మడిశెట్టి రమేష్ ,బి.ఎన్‌శంకర్, గౌస్‌బేగ్, టిఎన్ఎస్ఎఫ్ శివ, నరేష్, పెంచలయ్య, బుర్ర సుబ్బరాయుడు, గంగనపల్లి శీను, కనుకుర్తి వెంకటయ్య,ఎంపీ రావు, తిరుపాలు, నారపు శెట్టి శివ, ఉప్పు శెట్టి రెడ్డయ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు. **రాయచోటి :** నారా లోకేష్ బాబు జన్మదిన వేడుకలను మాజీ టిటిడి బోర్డు మెంబర్, టిడిపి నియోజకవర్గ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యువగళం పేరుతో నారా లోకేష్ చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లపు వాసు, మాజీ సర్పంచ్ దర్బార్ భాష, టిడిపి జిల్లా మైనారిటీ నాయకులు మయాన ఇర్షాద్ ఖాన్, సుగవాసిశ్రీనివాసులు,లాయర్ సతీష్‌రెడ్డి, మాజీ ఎంపిటిసిలు, ఖాదర్ హుస్సేన్, ఖలీల్,మాజీ కౌన్సిలర్లు రషీద్, నాగేంద్రరావు, సహదేవ, నాయకులు మన్నేరు రామాంజనేయులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉప్పరపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి వార్తకు స్పందన

గ్రామ ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు సానేశేఖర్, మనోజ్

ప్రజాశక్తి-పుల్లంపేట

సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో ఉప్పరపల్లిలో ప్రబలుతున్న విష జ్వరాలు అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన మండల వైద్యాధికారులు స్పందించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆర్.ఉప్పరపల్లిలో మండల వైద్యాధికారులు డాక్టర్ సానేశేఖర్, డాక్టర్ మనోజ్ చంద్ర ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజా పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సానే శేఖర్ మాట్లాడుతూ వైద్యశిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వైరల్ జ్వరాలు లక్షణాలు నివారణ మార్గాల గురించి ప్రజలకి అవగాహన కల్పించామన్నారు. వ్యాధి మూలాలు గుర్తించడంలో లార్వా సర్వే చేసి, నిల్వ నీరు ఉన్న ప్రాంతాలలో అబేట్ సంహారిణి పిచికారి చేయించారు. దోమల కుట్టకుండా రాత్రిపూట దోమతెరలు వాడాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే నియమాలు పాటించాలని తెలియజేశారు. క్యాంప్ నందు సుమారు 60 మందిని గుర్తించి పరిశీలించగా జ్వరము కేసులను గుర్తించి 32 మందికి రక్త నమూనాలు సేకరించి 25 మందికి రూట్ కిడ్స్ ద్వారా నిర్ధారణ పరీక్షలు జరిపి చికిత్స విధానాలను ప్రారంభించినట్లు తెలిపారు. పుల్లంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలు లభిస్తాయని, ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స చేయించుకొని వైద్యసలహాలు పొందాలని సూచించారు. ఇప్పటికైనా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతిరోజు ఏఎన్ఎం ద్వారా గ్రామాల పరిశీలన చేయించాలని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు. కార్యక్రమంలో స్థానిక పిహెచ్‌సిఎస్ హరోహరమ్మ, నాగజ్యోతి, సూపర్వైజర్ శివ గౌరీ, స్థానిక ఎఎన్ఎం సరస్వతి, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడిట్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి, పంచాయతీ కార్యదర్శులు

మండల ఆడిట్ సమావేశం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని స్థానిక ఎంపిపి సభాభవనంలో సోమవారం మండల ఆడిట్ సమావేశం ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఎంపిపి మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ బిల్స్ పై ఆడిట్ జరుగుతుందని ప్రతి పంచాయతీ కార్యదర్శి తమ ఎంబుక్స్ రికార్డ్స్ మొత్తం తీసుకుని వచ్చి ఆడిట్ చేపించుకోవాలని తెలిపారు. ప్రతి పంచాయతీ బిల్స్ సక్రమంగా ఉండా లని లేనియెడల వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తప్పకుండా ఆడిట్‌కు హాజరై సక్రమంగా బిల్స్ తీసుకుని వచ్చి ఆడిట్ చేయిం చుకోవాలని అన్నారు. మండలంలో ఏ పంచాయతీలో అయినా బిల్లుల విష యంలో అవకతవకలు జరిగితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రకాశం, మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

'మానవత'కు శాంతిరథం వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని శ్రీ జ్ఞానంబిక డిగ్రీ కళాశాలలో మానవత మదనపల్లె యూనిట్‌కు శాంతిరథాన్ని గాలివీడుకు చెందిన రమేష్‌రెడ్డి తల్లి జ్ఞాపకార్థం అందజేశారు. ఈ సందర్భందా శాఖ చైర్మన్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ఈ శాంతి రథం అందరికీ ఉపయోగిస్తామన్నారు. అనంతరం శాంతిరథం అందజేసిన దాత కుటుంబ సభ్యులకు యూనియన్ తరపున సన్మానించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, మానవత వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి, సభ్యులు దివ్యభారతి, ప్రసాద్‌రెడ్డి, గాలివీడు, పెద్దమండెం, బిగుతుకోట, పెద్దతిప్పసముద్రం, పుంగనూరు సభ్యులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి-కలికిరి

కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ చిరుధాన్యల సంవత్సరం సందర్భంగా బాలికలకు చిరుధాన్యా ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలి కలకు వివిధ రకాలైన చిరుధాన్యాలు వాటి యొక్క పోషక విలువలు, ఆరోగ్యవంతమైన జీవన విధానానికి చిరుధాన్యాల ఆవశ్యకత గురించి బాలికలకు వివరించడం జరిగింది. అదేవిధంగా వివిధ రకాలైన చిరుధాన్యాలతో తయారు చేసే విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి అవగాహన కల్పించారు. ప్రతిరోజు చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలు తీసుకోవడం వలన బాలికల్లో రక్త హీనత, క్యాల్షియం లోపాలకు ఊభకాయం వంటి పోషకాహార లోపాలను అధిగమించడంలో చిరుధాన్యాల యొక్క పాత్రను వివరించారు. కార్య క్రమంలో జ్యోతి, పాఠశాల ప్రిన్సిపల్ వై.సోమశేఖర్,విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చిన ఘనత వైసిపిదే

ప్రజాశక్తి - ఖాజీపేట

ఎన్నికల సమ యంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెంవేర్చిన ఘనత వైసిపి దేనని ఎమ్మెల్యే ఎస్. రఘు రామిరెడ్డి పేర్కొ న్నారు. మండల పరిధిలోని కూన వారిపల్లె పం చాయతీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతానగరం, పిచ్చపాటి పల్లె, దళితవాడ గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని పేర్కొ న్నారు. కార్యక్రమంలో సర్పంచు భూమన సుబ్బారెడ్డి, ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కో -ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, అగ్రహారం సహకారసంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-జమ్మలమడుగు

క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎస్.ఉప్పలపాడులో సోమవారం ఆయన కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా అర్హులు ఉండి సంక్షేమ పథకాలు అందలేదంటే వారికి మంజూరు చేయిస్తామని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి 2024 ఎన్నికల్లో పూర్తి మెజార్టీ ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గుర్రప్ప, వెంకటేశు, రవిశంకర్‌రెడ్డి, ఉప్పలపాటి యోబు, డైరెక్టర్ మార్బుల్ శ్రీను, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పాఠ్య ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి

ప్రజాశక్తి-చాపాడు

ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన లిప్ కార్యక్రమ అమలుపై సోమవారం ప్రధానోపాధ్యాయులకు డిఆర్‌పి తిరుమలకొండ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ 6,7,8 తరగతి విద్యార్థులకు డిసెంబర్ నెలలో ప్రాక్టీస్ టెస్ట్ (ప్రీ టెస్ట్) మార్కు రిజిష్టర్‌లో నమోదు చేసి ఉండాల న్నారు. ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికను సిద్దంగా ఉంచుకోవాలన్నారు. టీచింగ్ పీరియడ్, ప్రాక్టీస్ పీరియడ్‌ల ప్రకారం బోధనను ఉన్నతాధికారులు పరిశీలిస్తారన్నారు. ఎల్ఐపి గ్రేడింగ్ ప్రకారం విద్యార్థులను ఎ,బి,సిలుగా గుర్తించాలన్నారు. వెనకబడిన సి గ్రేడ్ విద్యార్థుల ప్రగతికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ANNAMACHARYA COLLEGE OF PHARMACY
Estd: 2003
New Boyanapalli, RAJAMPET, Kadapa Dist. A.P. – 516 126.
Approved by AICTE & PCI, New Delhi. Affiliated to JNTUA, Ananthapuramu
Accredited by NAAC 'A' Grade, Bangalore, Accredited by NBA.(UG), New Delhi.

SPOT ADMISSION :: 2022-23

Eligible candidates for admissions into 1st year B.Pharmacy & Pharm.D courses who have not taken admission in any college can attend for the spot admissions at 10.00 A.M. on 24.01.2023 at the institute premises with all original documents & necessary fee for filling-up the vacant seats as per guidelines of convenor APEAPCET-2022

Contact: 9848998641, 9912342118 PRINCIPAL

బంగారు పతకం సాధించిన నందకుమార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అథ్లెటిక్స్‌లో 'ఆదర్శ' విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి-కలకడ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలలో కలకడ ఆదర్శ పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి పి.నందకుమార్ లాంగ్‌జంప్ విభాగంలో సత్తాచాటి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడని ఫిజికల్‌డైరెక్టర్ కరుణాకర్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కోడిరామ్మూర్తి క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో ఈ ఘనత సాధించాడు. విద్యార్థి నందకుమార్ త్వరలో నిర్వహించబోయే జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. మండలంలోని కోటగుడిబండ పంచాయతీ ఎల్లంగుడిబండకు చెందిన నారాయణ, దేవీల రెండవసంతానం నందకుమార్ రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందడం గర్వకారణంగా ఉందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఆదర్శ పాఠశాల ప్రతిభను జాతీయ స్థాయికి తీసుకెళ్లిన విద్యార్థిని ప్రిన్సిపల్ మలంగ్‌షావలి, ఫిజికల్ డైరెక్టర్ కరుణాకర్, ఉపాధ్యాయ బృందాన్ని తోటి విద్యార్థులు అభినందించారు. **ములకలచెరువు :** ములకలచెరువు మండలం టి.చౌడసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్ బి.ఆయిషా ఈనెల 20న శ్రీకాకుళం జిల్లా కోడి రామ్మూర్తి క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 19,17,14 విభాగాలలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలలో పాల్గొని అథ్లెటిక్స్ డిస్కస్ త్రోబాల్‌లో ద్వితీయ స్థానం సాదించినట్లు ప్రధానోపాధ్యాయులు టి.హేమలత తెలిపారు. విద్యార్థిని త్వరలో జరగబోవు జాతీయ స్థాయి అథ్లెటికీలో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.ఈ సందర్భంగా పిఇటి టి.సాజిద్ భాష మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు సహకారం వల్ల విద్యార్థులు ప్రగతి సాధిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రతిభ సాధించిన విద్యార్థిని ఎంఇఒ ఎన్.వెంకటరమణ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టించిన ధీరుడు నేతాజీ

బి.కొత్తకోట : బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టించిన ధీరుడు నేతాజి సుభాష్ చంద్రబోస్ అని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు యన్.క్రిష్ణారెడ్డి కితాబునిచ్చారు. సోమవారం నేతాజీ జయంతి వేడుక వాకర్స్ అసోసియేషన్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ రెండుసార్లు భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా ఎన్నికైనా, గాంధీతో సిద్ధాంత పరమైన అభిప్రాయ భేదాల వలన ఆ పదవికి రాజీనామా చేశారని అన్నారు. గాంధీ అహింసావాదం మాత్రమే స్వాతంత్ర్య సాధనకు సరిపోదని, పోరుబాట కూడా ముఖ్యమని చంద్రబోస్ భావన అన్నారు. కార్యక్రమంలో ఎన్.క్రిష్ణారెడ్డితోపాటు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సాంబశివయ్య, ప్రసాద్, రాజశేఖర్, శంకరనారాయణ, బదరీనాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండల పరిధిలోని శ్రీశాంతినికేతన్ హైస్కూల్లో సోమవారం నేతాజీసుభాష్ చంద్రబోస్ 125వ జయంతిని కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ గురించి ఉపాధ్యాయులు చక్కగా విద్యార్థులకు వివరించారు.

క్రైం కార్నర్

అదుపుతప్పి కారు బోల్తా

ప్రజాశక్తి-రామాపురం

గువ్వల చెరువు ఘాట్‌లో అదుపుతప్పి బోల్తాపడ్డ కారు

కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి గువ్వల చెరువు ఘాట్ రోడ్డు రెండో మలుపు వద్ద సోమవారం కారు అదుపుతప్పి బోల్తా పడింది. చిత్తూరు నుండి కడపకి వెళుతున్న టిఎన్ 20డిడి బ్ల్యూ 7911 నెంబర్ గల కారు గువ్వల చెరువు ఘాట్ రెండో మలుపు వద్ద అదుపుతప్పి రక్షణ గోడను ఢీ కొట్టి కింద పడడంతో కార్లో ఉన్న వ్యక్తులు కు స్వల్ప గాయాలతో భయపడ్డారు. ప్రమాద ఘటన చూస్తే కారులో ప్రయాణిస్తున్న వారు తీవ్ర ప్రమాదానికి గురై ఉంటారని అనిపిస్తే ఎలా ఉంది సమాచారం తెలిసిన ఎస్ఐ కొండారెడ్డి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరగాడి ఉచ్చులో పడి మోసపోయిన యువతి

- ఖాతా నుంచి రూ.2.80 లక్షలు మాయం

మాట్లాడుతున్న ఎస్ఐ రామ్మోహన్

ప్రజాశక్తి - బి.కొత్తకోట

సైబర్ నేరగాడి ఉచ్చులో పడి ఓ యువతి మోసపోయిన సంఘటన బి.కొత్తకోట పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రామ్మోహన్ కథనం మేరకు వివరాలు. పట్టణానికి చెందిన రుషిత అనే యువతికి పరిచయం లేని ఓ వ్యక్తి ఫోన్ చేసి మీ ఎస్‌బిఐ యోనో బ్యాంక్ అకౌంట్ నెంబర్‌కు ఆధార్ లింక్ లేదని, నేను మీకు ఒక లింకు పంపుతానని అనంతరం ఒటిపి చెబితే బ్యాంకు ఖాతాకు ఆధార్ నెంబరును అనుసంధానం చేస్తానని తెలిపాడు. ఆ యువతి లింకును ఓపెన్ చేసి ఒటిపి చెప్పడంతో ఆమె ఖాతాలోనే రూ 2.80 లక్షల నగదు కట్ అయిందన్నారు.అంతటితో ఆగకుండా మరోసారి మీ నెంబర్‌కు ఒటిపి వస్తుందని అది చెబితే లింక్ అవుతుందని తెలపడంతో యువతి మరోసారి ఒటిపి నెంబర్ చెప్పింది.అకౌంట్ నుండి మరో రూ.25వేలు కట్ కావడంతో తాను మోసపోయినట్లు ఆ యువతి గుర్తించి పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేసిందన్నారు. వెంటనే తాము సైబర్ క్రైమ్ ఫిర్యాదు నెంబర్ 1930కి ఫోన్ చేసి రూ.25,000 వేలను బ్లాక్ చేశామని, అనంతరం నిందితుడుపై ఐటి యాక్ట్ కింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు .అదేవిధంగా సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ అకౌంట్ నెంబర్లు, ఒటిపి నెంబర్లు అడిగితే చెప్పకూడదన్నారు. ఒకవేళ మీకు ఏదైనా సందేహం ఉంటే సదరు బ్యాంకును సంప్రదించాలన్నారు.సైబర్ క్రైమ్ ద్వారా ఒకసారి నగదు వెళ్లిపోతే తిరిగి రికవరీ చేయడం కష్టమన్నారు. ఉత్తర భారతదేశానికి చెందినవారు ఇటువంటి నేరాలు ఎక్కువగా పాల్పడు తున్నారని, ప్రజలందరూ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

నిమ్మనపల్లి: పేకాట స్థావరాలపై పోలీసులు ముమ్మర దాడులు నిర్వహించి 12 మందిని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఎస్ఐ ఫాతిమా తెలిపారు.ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని అగ్రహారం పంచాయతీ చెరువు ముందరపల్లి సమీపంలో సోమవారం సాయంత్రం సమయంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి 12 మందిని అరెస్ట్‌చేసి, వారి వద్ద నుండి రూ.60,550 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.మండలానికి చెందిన ఆవులరాజశేఖర్ రెడ్డి, ఆరమడక రమణారెడ్డి, వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామానికి చెందిన మూలింటి ఎల్లారెడ్డి, కంభం సురేష్‌కుమార్‌రెడ్డి, కలికిరి సుబ్బారెడ్డి, కోటకొండ సత్తయ్య, రాసపల్లి నరసిం హారెడ్డి, పూజారి రమణ, ఒంటరి రాజారెడ్డి, రాంపల్లి వెంకటరమణ, బుదిగిరిరెడ్డి రామచంద్రారెడ్డి, కలికిరి దేవేంద్ర రెడ్డి లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, కానిస్టేబుల్ శివ, కేశవ, రెడ్డి భాష పాల్గొన్నారు.